సౌకర్యంగా మున్సిపల్ భవన నిర్మాణం



నూతన భవనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, కార్పొరేటర్లు, నాయకులు

ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

బండ్లగూడ : అందరికీ సౌకర్యవంతంగా ఉండేలా నూతన మున్సిపల్ కార్పొరేషన్ భవన నిర్మాణం జరిగిందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ అన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కిస్మత్‌పూర్‌లో నిర్మాణం పూర్తి చేసుకున్న నూతన భవనాన్ని గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. గత ప్రభుత్వంలో మంజూరైన రూ. 12.80 కోట్ల నిధులతో నూతన భవన నిర్మాణం పూర్తి చేసుకున్నామన్నారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా మున్సిపాలిటీల అభివృద్ధికి నిధులు మంజూరు చేసి అభివృద్ధి పథంలో నడిపించాలని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డితో త్వరలోనే మాట్లాడి భవనాన్ని ప్రారంభోత్సవం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రాందాస్‌ముదిరాజ్, కమిషనర్ శరత్‌చంద్ర, కార్పొరేటర్లు సాగర్‌గౌడ్, మహేందర్‌గౌడ్, నాయకులు అంతారం నరేశ్, గోకరి సురేశ్‌గౌడ్, పాపయ్యయాదవ్, సాయిబాబాగౌడ్, సుమన్‌గౌడ్, మల్లేశ్‌యాదవ్, సుందర్‌గౌడ్, యాదిరెడ్డి, ప్రవీణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు వేయించాలని వినతి

మైలార్‌దేవ్‌పల్లి : ఆలయం ఎదుట రోడ్డు వేయించాలని బాబుల్‌రెడ్డినగర్ పోచమ్మ ఆలయ కమిటీ సభ్యులు గురువారం కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. బోనాల పండుగ రానున్న సందర్భంగా ఆలయం ముందు భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. వెంటనే కార్పొరేటర్ అధికారులకు ఫోన్ చేసి.. రోడ్డు నిర్మాణానికి ఎస్టిమేషన్ వేయాలని కోరారు. కాలనీలో డ్రైనేజీ సమస్యను కూడా పరిష్కరిస్తానని కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు వెంకటరమణగుప్తా, రమేశ్ రెడ్డి, శంకర్, మల్లేశ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



కార్పొరేటర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బాబుల్‌రెడ్డినగర్ వాసులు

విద్యార్థినులు లక్ష్యంతో ముందుకెళ్లాలి



సెమినార్‌లో పాల్గొన్న విద్యార్థినులు

మణికొండ: విద్యార్థినులు ఒక లక్ష్యంతో ముందుకెళ్లాలని, దాని సాధనకు శక్తి వంచన లేకుండా కృషి చేయాలని లైఫ్ స్కిల్ కోచ్ గీతారాణి అన్నారు. గండిపేటలోని మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎంజీఐటీ) కళాశాలలో గురువారం వై కనెక్ట్, డబ్ల్యూడీసీలతో కలిసి పరిశుభ్రత, వ్యక్తిత్వ వికాసం అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె హాజరై మాట్లాడారు. విద్యార్థినులు రాణించేందుకు సాధికారత కల్పించాల్సిన బాధ్యత సమాజంపై ఉందన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జి. చంద్రమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలి

మైలార్‌దేవ్‌పల్లి : డివిజన్‌లో నెలకొన్న డ్రైనేజీ సమస్యను శాశ్వత పరిష్కారం చూపాలని కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం డివిజన్ పరిధిలోని బృందావన్ కాలనీ, వాంబే కాలనీలో జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులతో కలిసి పర్యటించారు. కాలనీల్లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని వాంబేకాలనీ ప్రజలు కార్పొరేటర్‌కు వివరించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎక్కడ చూసినా డ్రైనేజీ సమస్యలు ఉన్నాయని, వాటిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. రోడ్లు, డ్రైనేజీ సమస్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ నరసింహ మూర్తి, జలమండలి మేనేజర్ వినాయక్, వర్క్‌ఇన్‌స్పెక్టర్ రాహుల్, వినయ్, అడికె జనార్దన్, మధు, ఎన్ను రవి, శంకర్ రెడ్డి, తలారి చిన్నా, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.



బృందావన్ కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి

వాడివేడిగా కౌన్సిల్ సమావేశం

- లెక్కల గోల్‌మాల్‌పై అధికారులను నిలదీసిన కౌన్సిలర్లు
- నాటి తైబజార్ వేలం రద్దు
- రూ. 24.65 కోట్ల పనులకు తీర్మానం



మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ ప్రదీప్‌కుమార్

మణికొండ: ఇష్టారాజ్యంగా తీర్మానాలు చేసుకుని మున్సిపల్ నిధులను దుర్వినియోగం చేస్తే ఎలా...? అత్యవసర పాత పనులను పక్కన పెట్టి, మీరు లబ్ధి పొందే పనులకు కొత్త తీర్మానాలు ఎలా చేస్తారు...? ఒకే పద్దుకు మూడేసి సార్లు బిల్లులు పెట్టి నిధులను ఎలా ఖర్చు చేస్తారంటూ కౌన్సిలర్‌లు అధికారులను నిలదీశారు. మణికొండ మున్సిపల్ కౌన్సిల్ సమావేశం గురువారం చైర్మన్ కె. నరేందర్‌ముదిరాజ్ అధ్యక్షతన మధ్యాహ్నం 3.30 గంటల వరకు కొనసాగింది. సమావేశంలో మున్సిపాలిటీ పరిధిలో చేపట్టాల్సిన పనులు, నిధుల ఖర్చుల విషయంలో ఎజెండాలోని ప్రతి అంశంపై కౌన్సిలర్‌లు ప్రశ్నల వర్షం కురిపించారు. అనునిత్యం ప్రజలు గోతుల రోడ్లపై ప్రయాణిస్తున్నా వాటికి మరమ్మతులు ఎందుకు చేయటం లేదని ప్రశ్నించారు. పండుగలు, ఉత్సవాల పేరుతో కోట్లాది రూపాయలను దుర్వినియోగం చేశారని మండిపడ్డారు. కార్యాలయ నిర్వహణ పేరుతో లక్షల రూపాయలను దండుకుంటున్నారని, వాటిపై విచారణ చేయాలని కలెక్టర్‌తో పాటు సీడీఎంఏ అధికారులకు ఫిర్యాదులు చేస్తామని కొందరు కౌన్సిలర్‌లు తెలిపారు.

తైబజార్ వేలం రద్దు

మున్సిపాలిటీ పాలక కమిటీ తీర్మానం లేకుండా తైబజార్ వేలం పాట ఎలా నిర్వహిస్తారని కౌన్సిలర్‌లు కమిషనర్‌ను ప్రశ్నించారు. ఎన్నికల కోడ్ ఉన్నందున గతంలో సమావేశాలు జరగకపోవటంతో నిర్వహించామని కమిషనర్ సమాధానం ఇచ్చారు. ఇటీవల నిర్వహించిన తైబజార్ వేలాన్ని రద్దు చేసి కౌన్సిల్ తీర్మానం తీసుకున్న తరువాతనే తిరిగి వేలం వేయాలని తీర్మానించారు.

రూ.24.68 కోట్ల పనులకు తీర్మానం

మణికొండ మున్సిపాలిటీ పాలక కమిటీ సమావేశంలో రూ.24.68 కోట్ల పనులను చేపట్టాలని తీర్మానించారు. వాటిల్లో ప్యాచ్ వర్క్ పనులకు రూ.88 లక్షలు, బీటీ రోడ్డు నిర్మాణాలకు రూ.50 లక్షలు, మ్యాన్‌హోల్‌ల మరమ్మతులకు రూ.1.06 కోట్లు, విద్యుత్ పనులకు రూ.45.5 లక్షలు, కమ్యూనిటీహాల్‌ల మిగులు పనులకు రూ.1.64 కోట్లు, డ్రైనేజీ కొత్త పనులకు రూ.2.45 కోట్లు, ఇతర పనులకు రూ.15.01 కోట్లను ఖర్చు చేయాలని తీర్మానించారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని సిబ్బందికి రెయిన్‌కోట్‌లు, ఇతర సామగ్రిని అందజేశారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కె. నరేందర్‌రెడ్డి, కమిషనర్ డి. ప్రదీప్‌కుమార్, మేనేజర్ రమేశ్, డీఈ దివ్యజ్యోతి, అకౌంటెంట్ వీరస్వామి, కౌన్సిలర్‌లు, కోఆప్షన్ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



వర్షాకాలం పనిముట్లను అందజేస్తున్న చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు

నేడు ఎస్‌టీబీఎల్‌లో యోగా దినోత్సవం

మణికొండ : నార్సింగిలోని ఎస్‌టీబీఎల్ సంస్థ ఆధర్యంలో శుక్రవారం ఉదయం 7 గంటలకు అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. బృందావన్ కాలనీలోని కోరల్‌హోమ్స్‌లో జరిగే ఈ కార్యక్రమానికి సినీ నటుడు రవిప్రకాశ్, ఎస్‌టీబీఎల్ చైర్మన్ జి.బాలాజీ, ఎండీ పత్తిపాటి సంతోష్‌నాయుడు హాజరుకానున్నట్లు తెలిపారు.

నేడు రెయిన్ అవుట్ షెల్టర్‌కు శంకుస్థాపన

ఏజీవర్సిటీ : నేరుగా విత్తే వరిసాగు పరిశోధనలు, వరి రకాలను అభివృద్ధి చేయడానికి రెయిన్ అవుట్ షెల్టర్‌కు శుక్రవారం శంకుస్థాపన చేయనున్నట్లు భారతీయ వరి పరిశోధన సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సంజయ్ ప్రకాశ్ తెలిపారు. నేరుగా విత్తే వరి సాగులో ఖర్చు తక్కువ, కూలీల కొరత లేకుండా ఉంటుందని అన్నారు. రాష్ట్రంలో నేరుగా విత్తే వరిసాగును మరింత ప్రోత్సహించాలని కొన్ని సంస్థలు ఒక ప్రాజెక్టును చేపడుతున్నాయని తెలిపారు. ఈ పద్ధతి ద్వారా 40 శాతం నీరు, 20 నుంచి 30 శాతం ఖర్చు ఆదా అవుతుందని చెప్పారు. ఈ పద్ధతి వల్ల 7 నుంచి 10 రోజులు పంట కాల వ్యవధి తగ్గుతుందన్నారు.

'లక్షే లక్ష్యం'లో బహుమతుల ప్రదానం

రాజేంద్రనగర్: లక్షే లక్ష్యం కార్యక్రమంలో భాగంగా రాజేంద్రనగర్ డిపోలో గురువారం బహుమతుల ప్రదానం, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా మే నెలలో ఉద్యోగుల పిల్లలకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఇందులో విజేతలుగా కేటగిరి–1లో ప్రథమ బహుమతి పట్నం శెట్టి సాయి కల్యాణ్, ద్వితీయ బహుమతి కె.భానుతేజ, తృతీయ బహుమతి మాధ్యూ అందుకున్నారు. కేటగిరి–2లో ప్రథమ బహుమతి రాథోడ్ పవన్ కుమార్, ద్వితీయ బహుమతి డి.పావనీ, తృతీయ బహుమతి వి.రక్షిత గెలుపొందారు. సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొన్న సిబ్బందిని డిపో మేనేజర్ శ్రీనాథ్ సత్కరించారు. ఏప్రిల్, మే నెలలో విశేష ప్రతిభ కనబరిచిన కండక్టర్లు, డ్రైవర్లు, మెకానిక్ సిబ్బందిని ప్రగతిచక్ర అవార్డుతో సత్కరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ రవి కుమార్, మెకానికల్ ఇంజినీర్ నీలిమ, ఎస్‌టీఐ సుశీల, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.



బహుమతులు, సర్టిఫికెట్లతో ఉద్యోగులు, సిబ్బంది తదితరులు

విద్యుత్ బిల్లులకు కౌంటర్‌గా బస్టాండ్



రాజేంద్రనగర్: ప్రయాణికుల సౌకర్యార్థం గతంలో బస్టాండ్‌ను నిర్మించారు. అది కాస్తా ప్రస్తుతం విద్యుత్ వినియోగదారులకు సౌలభ్యంగా మారింది. రాజేంద్రనగర్ బుద్వేల్ శివాంజనేయ స్వామి దేవాలయం ప్రాంతంలో గతంలో బస్టాండ్‌ను నిర్మించారు. పాత మున్సిపాలిటీ కార్యాలయం ఉన్న సమయంలో ఈ బస్టాండ్‌ను ఏర్పాటు చేశారు. మినీ బస్సుల రద్దుతో ప్రస్తుతం ఈ ప్రాంతం నుంచి ఎలాంటి రాకపోకలు సాగడం లేదు. దీంతో నిరూపయోగంగా మారింది. స్థానికంగా ప్రతి నెల విద్యుత్ బిల్లుల వసూలు చేసేందుకు విద్యుత్ శాఖ కౌంటర్‌ను ఏర్పాటు చేస్తుంది. వర్షాలు పడుతున్న నేపథ్యంలో విద్యుత్ శాఖతో పాటు వినియోగదారులకు వరంగా మారింది. బస్టాండ్ ఆవరణలో విద్యుత్ బిల్లులను వసూలు చేసేందుకు తగిన ఏర్పాట్లు చేసుకున్నారు. ఒక శాఖ నిర్మిస్తే... మరో శాఖ దీన్ని ఉపయోగించడం గమనార్హం.

యోగా దినోత్సవానికి నేడు ఎమ్మెల్యే రాక

మైలార్‌దేవ్‌పల్లి : అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా డివిజన్ పరిధిలోని కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో శుక్రవారం యోగా కార్యక్రమాన్ని శ్రీ వివేకానంద యోగా సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, అడిషనల్ పోలీస్ కమిషనర్ పోల విజయ్‌కుమార్, డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి హాజరుకానున్నారు. ఈ మేరకు యోగా సమితి గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. యోగా గురువులు మీనా కుమారి, భద్రయ్య ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు.

బాధ్యతలు స్వీకరించిన శంషాబాద్ డీసీపీ రాజేశ్

శంషాబాద్ : శంషాబాద్ డీసీపీగా నియమితులైన బి.రాజేశ్ గురువారం డీసీపీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇంటెలిజెన్స్ బ్యూరో ఎస్పీగా పనిచేసిన ఆయన ఇక్కడికి బదిలీ అయ్యారు. ఇక్కడ డీసీపీగా పనిచేసిన నారాయణరెడ్డి బదిలీపై వికారాబాద్ ఎస్పీగా వెళ్లారు. బాధ్యతలు స్వీకరించిన డీసీపీకి ఆర్‌జీఐఏ సీఐ బాలరాజు మొక్కను అందజేసి స్వాగతం పలికారు.



డీసీపీ బి.రాజేశ్‌కు మొక్క అందజేస్తున్న బాలరాజు

గంటలోనే బాలుడి ఆచూకీ లభ్యం

కుటుంబ సభ్యులకు అప్పగించిన పోలీసులు

అత్తాపూర్ : పాఠశాలకు వెళ్తున్నానని చెప్పి అదృశ్యమైన బాలుడిని పోలీసులు గంటలోనే వెతికి కుటుంబ సభ్యులకు అప్పగించారు. పోలీసుల వివరాల ప్రకారం.. అత్తాపూర్ పాండురంగానగర్ నివాసి అరణేష్ శర్మ(10) ఉదయం 8:30 గంటలకు పాఠశాలకు తన చెల్లితో కలిసి వెళ్లాడు. పాఠశాల అనంతరం తిరిగి చెల్లి ఇంటికి చేరుకుంది. అన్నయ్య రాలేదని ఆమె తన తల్లికి చెప్పింది. చుట్టుప్రక్కల అన్ని ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. చివరికి అత్తాపూర్ పోలీసులను ఆశ్రయించారు. దీంతో పోలీసులు చుట్టుప్రక్కల బాలుడి ఆచూకీ తెలుసుకున్నారు. గంట వ్యవధిలో పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు. అనంతరం కుటుంబ సభ్యులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.



బాలుడిని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న పోలీసులు

అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు సత్కారం

రాజేంద్రనగర్: టీఎన్‌జీఓస్ సెంట్రల్ యూనియన్ కమిటీ నూతన అధ్యక్షుడు ఎం.జగదీశ్, ప్రధాన కార్యదర్శి ముజీబ్‌లను గురువారం సాయంత్రం నగరంలోని కార్యాలయంలో హార్టికల్చర్ యూనివర్సిటీ నాన్ టీచింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షులు పూతరాజు యాదయ్య ఆధ్వర్యంలో సత్కరించారు. హార్టికల్చర్ యూనివర్సిటీలోని ఉద్యోగుల ఎదుర్కొంటున్న సమస్యలను వివరించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి చిన్నమయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ రజనీ కాంత్, వైస్ ప్రెసిడెంట్ టి.కుమార్, రామకృష్ణ, శ్రీకాంత్, వెంకటస్వామి, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగంపై నిర్లక్ష్యం తగదు



సమావేశంలో పాల్గొన్న విద్యార్థి సంఘం నాయకులు

శంషాబాద్ : విద్యా వ్యవస్థపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం సరికాదని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ చాకలి మహేశ్, సీనియర్ నాయకుడు ప్రదీప్ అన్నారు. గురువారం పట్టణంలోని ఏబీవీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వ బడుల్లో నేటికి కూడా విద్యార్థులకు పుస్తకాలు, యునిఫాం పూర్తి స్థాయిలో అందలేదన్నారు. మధ్యాహ్న భోజనంలో నాణ్యమైన ఆహారాన్ని అందించాలన్నారు. ప్రైవేట్ విద్యాలయాల్లో ఫీజుల దోపిడీని అధికారులు తక్షణమే అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏబీవీపీ నాయకులు రాజు, కిశోర్, లావణ్య తదితరులున్నారు.

నులిపేద్దాం.. నివారిద్దాం

- నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ
- పాల్గొన్న ప్రజాప్రతినిధులు,వైద్యాధికారులు



నార్సింగిలో నులిపురుగుల నివారణ మాత్రలు వేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లు

మణికొండ: నులిపురుగులను నివారించడానికి 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు పిల్లలు తప్పనిసరి మాత్రలు వేసుకోవాలని నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్ అన్నారు. గురువారం జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా నార్సింగిలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌లు పత్తి ప్రవీణ్‌కుమార్, లక్ష్మీప్రవళికకిరణ్, హెచ్‌ఎం విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మైలార్‌దేవ్‌పల్లి : విద్యార్థుల ఆరోగ్యం పట్ల ఉపాధ్యాయులు శ్రద్ధ చూపాలని డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం జాతీయ నులిపురుగుల నివారణ దినం సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో మైలార్‌దేవ్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కార్పొరేటర్ హాజరై విద్యార్థులకు మాత్రలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 1–19 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు ఈ మాత్రలు తప్పనిసరిగా వేయించాలని చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌సీఓ సిరాజుద్దీన్, కేశవ్, స్రవంతి, మమత, గ్లోరీ, రేఖ, శ్రీలత, టి చిన్నా తదితరులు పాల్గొన్నారు.

ఆరు నెలలకు ఒకసారి..

మైలార్‌దేవ్‌పల్లి : నట్టల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలను ప్రతి ఆరు నెలలకు ఒకసారి తప్పని సరిగా వేయిస్తున్నామని మైలార్‌దేవ్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ కమ్యూనిటీ అధికారి సిరాజుద్దీన్ అన్నారు. జాతీయ నట్టల నివారణ దినోత్సవం సందర్భంగా డివిజన్ పరిధిలో గణేశ్‌నగర్‌లోని జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మాత్రలు వేసుకోవడం వల్ల విద్యార్థులు ఉల్లాసంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రఘు, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ హీనా, డాక్టర్ చేతన్, హెచ్ఈఓ కేశవ్, హెల్త్ సూపర్ వైజర్ శివకుమార్, చంద్రకళ, డీపీఎంఓ రవీందర్‌రెడ్డి, రాణి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కవ్వగూడ పాఠశాలలో..

శంషాబాద్ రూరల్ : మండలంలోని కవ్వగూడ ప్రాథమిక పాఠశాలలో ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. నులిపురుగుల నివారణ కోసం విద్యార్థులు మాత్రలను వేసుకోవాలని జడ్పీటీసీ తన్వీరాజు సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ రాంరెడ్డి, పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ దివ్య, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బండ్లగూడ పరిధిలో..

బండ్లగూడ : కాళీమందిర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మాత్రలు వేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేయర్ లతాప్రేమ్‌గౌడ్ హాజరై మాట్లాడారు. ఆరోగ్యంపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డి, టింకురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతోనే నివారణ

బండ్లగూడ : అవగాహనతో నులిపురుగులను నివారించవచ్చని వైద్యాధికారి అమృత అన్నారు. హైదర్షాకోట్‌లోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను వేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ.. పిల్లల కడుపులో నులిపురుగులు ఉంటే రక్తహీనత, ఆకలి మందగించడం, విరోచనాలు, బరువు తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తాయని తెలిపారు. ఆరోగ్య సంరక్షణకు శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది అరుణ, రమ, హెచ్‌ఎం సైదిరెడ్డి, ఉపాధ్యాయులు రవికుమార్, కవిత, సత్య, శీతల్, మదన్‌కుమార్, రవి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



హైదర్షాకోట్ ప్రభుత్వ పాఠశాలలో నులిపురుగుల మాత్రలు వేస్తున్న వైద్యాధికారి అమృత



ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న హెల్త్ కమ్యూనిటీ అధికారి సిరాజ్‌ఉద్దీన్



కాళీమందిర్ పాఠశాలలో మాత్రలు వేస్తున్న మేయర్ లతాప్రేమ్‌గౌడ్

ఆర్‌ఎంపీ, పీఎంపీలకు సర్టిఫికెట్లు ఇవ్వాలి

సుల్తాన్‌బజార్: కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు తెలంగాణ ఆర్‌ఎంపీ, పీఎంపీలకు వెంటనే శిక్షణ కల్పించి సర్టిఫికెట్లు, గుర్తింపు కార్డులను ఇవ్వాలని తెలంగాణ ఆర్‌ఎంపీ, పీఎంపీ సంఘాల ఉమ్మడి వేదిక నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు హైదర్‌గూడలోని ఎన్‌ఎస్‌ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వేదిక నేతలు విజ్ఞాన దర్శిని, ఉమేష్ చప్పరి, శంకర్ ముదిరాజ్, వెంకట్‌రెడ్డి, బాల బ్రహ్మాచారి, రామాశంకర్, భాస్కర్ మాట్లాడారు. 2008లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో జీఓ నెంబర్ 273 ద్వారా ఆర్‌ఎంపీ, పీఎంపీలందరికీ కమ్యూనిటీ పారామెడిక్స్‌గా శిక్షణ ఏర్పాటు చేసి 13 వేల మందికి శిక్షణ ఇచ్చారన్నారు. నాడు శిక్షణ పూర్తి చేసుకున్న వారికి వైఎస్ మరణాంతరం నేటికి సర్టిఫికెట్లు ఇవ్వలేదని వాపోయారు. దీంతో ఆర్‌ఎంపీ, పీఎంపీ కుటుంబాలు అభద్రతలో జీవిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మెడికల్ కౌన్సిల్ అధికారులు తమపై దాడులు చేసి అక్రమ కేసులు పెడుతున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో రవిశంకర్, మోహన్, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వేదిక నేతలు

ఉద్యోగుల ఆరోగ్యానికి పెద్దపీట

సాక్షి, సిటీబ్యూరో: ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్ ఉద్యోగుల ఆరోగ్యం పట్ల అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని మెహిదీపట్నం డిపో మేనేజర్ బీవీకే మూర్తి అన్నారు. వీసీ సజ్జనార్ ఆదేశాల మేరకు మెహిదీపట్నం డిపోలో గ్రాండ్ హెల్త్ చాలెంజ్ 2–0 ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం గురువారం ముగిసింది. డాక్టర్ జహీరా ఉద్యోగులకు రక్త పరీక్షలు నిర్వహించారు. ఈసీజీ, ఇతర రిపోర్టులు చూసి ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈ సందర్భంగా డీఎం మూర్తి మాట్లాడుతూ.. సంస్థకు కార్మికులు గుండెకాయలాంటి వారని చెప్పారు. కార్మికులు ఆరోగ్యంగా ఉంటేనే సంస్థకు మనుగడ ఉంటుందని, అందుకే ప్రతి ఒక్కరూ విధులతో పాటు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. తమపై ఎంత ఒత్తిడి ఉన్నా.. వాటిని అధిగమించి సంస్థ అభివృద్ధికి కార్మికులు పాటుపడుతున్నారని కితాబిచ్చారు. ఆరోగ్యమే మహాభాగ్యమని, కార్మికులు తమ ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం చేయకూడదని అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్) నమ్రత పేర్కొన్నారు. వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించడంపై కార్మికులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఈడబ్ల్యూబీ సభ్యుడు ఎంఏ సలీం, ఏఈఎం ఎ.ప్రకాశ్‌రావు హెల్త్ వాలెంటర్ సీహెచ్ స్వప్న తదితరులు పాల్గొన్నారు.



బస్తీ దవాఖానా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు వినతిపత్రం ఇస్తున్న సంఘం నాయకులు

సుల్తాన్‌బజార్: బస్తీ దవాఖానా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ బస్తీ దవాఖానా కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అంజాద్ అలీఖాన్ డిమాండ్ చేశారు. తెలంగాణ వైద్య ఆరోగ్యశాఖ మాత్యులు దామోదర రాజనర్సింహను కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని, సపోర్టింగ్ సిబ్బందికి వేతనాలు పెంచాలని మంత్రికి విన్నవించినట్లు తెలిపారు. మంత్రి సానుకూలంగా స్పందించారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం హైదరాబాద్ ఇన్‌చార్జి సన్నిత్, సంఘం సభ్యులు కుశాల్, సుదర్శన్, మొహిన్, వహీం, విక్రమ్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

విజయనగర్‌కాలనీ: అక్రమంగా నిర్మించిన రేకుల షెడ్లను ఆసిఫ్‌నగర్ రెవెన్యూ అధికారులు హుమాయూన్ నగర్ పోలీసుల బందోబస్తు మధ్య గురువారం కూల్చివేశారు. ఆసిఫ్‌నగర్ తహసీల్దార్ ఎస్.జ్యోతి తెలిపిన వివరాల ప్రకారం.. ఆసిఫ్‌నగర్ దేవునికుంట శ్మశానవాటికలో విజయనగర్‌కాలనీ వైపు ఉన్న శిఖం భూమిలో కొద్ది రోజుల నుంచి అక్రమంగా రేకుల షెడ్లు ఏర్పాటు చేసి కొందరు వ్యక్తులు భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న రెవెన్యూ సిబ్బంది గురువారం జేసీబీ సహాయంతో కూల్చివేశారు.